# రెండు జీవాలు : నిండు హృదయాలు

జిజియా, కమలాకరం మద్రాసునుంచి వచ్చే రైల్లో దిగారు. మద్రాసులో ఒక కాలేజీలో కమలాకరం ప్రొఫెసరు. ఆ కాలేజీలోనే జిజియా ఆనర్సు పరీక్ష చదివింది.

కాలేజీ సారస్వత సంఘానికి జిజియా సెక్రటరీ, కమలాకరం ప్రెసిడెంటు. ఈ విధంగా వాళ్ళిద్దరికీ స్నేహం కలిగింది. వాళ్ళిద్దరికీ స్నేహం కలగటానికి మరొక కారణంకూడా వుంది. ఇద్దరూ ఒకతాలూకానుంచే వచ్చారు. ఇద్దరి గ్రామాలూ దగ్గరే.

సారస్వత సంఘం పనుల్లో వాళ్ళు తరచు కలుస్తూ వుండేవారు. అనేక విషయాలను గురించి చర్చించుకుంటూ వుండేవారు. వాళ్ళ స్నేహం అందరి స్నేహం వంటిది కాదు. అన్ని విషయాల్లోనూ యిద్దరూ ఒకే విధంగా ఆలోచించే వారు.

ఇద్దరికీ సంఘసేవ చెయ్యాలనీ, భారతదేశంలో వున్న దారిద్ర్యం పోగొట్టి ప్రజలను బాగుచెయ్యాలనీ అభిలాష వుండేది.

“చదువు పూర్తి అవగానే సంఘసేవ చేస్తాను” అనేది జిజియా.

“దేశం అంతా ఇలా అల్లకల్లోలంగా వున్నప్పుడు ఏమీ అంటనట్టు ఉద్యోగం చేసుకుంటూ కూర్చోవటం నాకూ ఏమీ బాగాలేదు” అనేవాడు కమలాకరం.

“మరి ఏం చేస్తారు?”

“ఉద్యోగానికి రాజీనామా పెడదా మనుకుంటున్నాను.”

వాళ్ళిద్దరూ ఒకరు మహమ్మదీయులు. ఒకరు హిందువులు అయినా— వాళ్ళ ఆలోచనలకు మతం ఎప్పుడూ అడ్డు వచ్చేదికాదు. భారతదేశం

దాస్యంలో, దారిద్ర్యంలో వుండటంవల్ల మహమ్మదీయులూ కష్టపడుతున్నారు హిందువులూ కష్టపడుతున్నారు. ప్రత్యేకం మహమ్మదీయులకి సహాయం చెయ్యాలి అనుకోటంగానీ, ప్రత్యేకం హిందువులకే సహాయం చెయ్యాలి అనుకోటంగానీ వాళ్ళకి బొత్తిగా అర్థమయ్యేదికాదు. సహాయం ఎవళ్ళకి అవసరమో వాళ్ళకి చెయ్యాలి. హిందువులలోను, మహమ్మదీయులలోను ధనవంతులున్నారు. ఈ ధనవంతులు వాళ్ళ వాళ్ళ మతాలలో వున్న బీద వాళ్ళని దోచుకుంటూనే వున్నారు. కాబట్టి భారతదేశాన్ని బాగుచెయ్యాలంటే మత దృష్టితో చూడటంవల్ల లాభంలేదు, అన్ని మతాల్లో వున్న బీదవాళ్ళకి సహాయం చెయ్యగలిగినప్పుడే మొత్తం దేశం బాగుపడుతుంది-అనుకుంటూ వుండేవారు.

రైలు స్టేషన్‌లో దిగగానే వాళ్ళ మనస్సులు ఇటువంటి ఉత్తమమైన ఆలోచనలతో తొణికిస లాడుతున్నాయి. వారి వారి గ్రామాలకి వెళ్ళటానికి, వారు విడిపోవలసిన సమయం వచ్చింది. స్టేషన్ దగ్గరనుంచి కమలాకరం గ్రామం వెళ్ళాలంటే బస్సుమీద ఇరవైమైళ్ళు వెళ్ళాలి ఉత్తరంగా. జిజియా గ్రామానికి పదిమైళ్ళు వెళ్ళాలి దక్షిణంగా.

ఇప్పుడు వారు కొత్తగా మాట్లాడుకోవలసిన సంగతులేమీ లేవు. ఏమయినాసరే సంఘసేవకి తమ జీవితాలని అర్పించాలనే సంకల్పాన్ని మళ్ళీ వొకసారి పునశ్చరణ చేసుకున్నాదు.

"సెలవు" అన్నది జిజియా.

"మళ్ళీ ఎప్పుడు కనపట్టం?" అడిగాడు కమలాకరం.
దీనికి వెంటనే జవాబు చెప్పలేకపోయింది జిజియా.
"ఇక మా వూళ్లోనే ఉంటాను" అన్నాడు కమలాకరం.

"మరి ఉద్యోగమో!" అన్నది జిజియా.

"మా వూరినుంచే రాజీనామా పంపిస్తాను కష్టమో నిష్ఠూరమో నేను నిశ్చయించుకున్నాను— ప్రజల సుఖంకోసం నా జీవితం అంకితం చేస్తాను." అన్నాడు కమలాకరం.

"నేనూ అలాగే అనుకుంటున్నాను. ముందు మా గ్రామ ప్రజలకి నాకు చేతనైనా సేవ చెయ్యటానికి ప్రయత్నిస్తాను" అన్నది జిజియా.

"అయితే తప్పక కలుసుకుంటాం" అన్నాడు కమలాకరం.

"ఆలోచనలు ఒకటే అయినప్పుడు ఎక్కడ వున్నా కలసివున్నట్టే" అన్నది జిజియా.

వాళ్ళ మనస్సులో అనేక భావాలు పరుగెత్తినై. ఎన్నో సంగతులు చెప్పుకోవాలనుకున్నారు. కాని వాళ్ళకి మాటలు రాలేదు. పైకి మాటాడు కోక పోయినప్పటికీ తమ హృదయాలు విప్పి చెప్పుకున్నట్టే వుంది వాళ్ళకి. కమలాకరం జిజియాని బండి ఎక్కించి, కనిపిస్తున్నంతసేపూ అలాగే చూస్తూ నుంచున్నాడు.

*   *   *   *

జిజియా కమలాకరాల హృదయాలు నిండైనవి; స్వచ్ఛమైనవి. కాని అజ్ఞానంలో, దారిద్ర్యంలో కుళ్ళే ప్రజల పరిస్థితి వేరు. ఆ సంగతి వాళ్ళకి గ్రామంలో అడుగు పెట్టగానే తెలిసింది.

కమలాకరం గ్రామంలో హిందువులూ, మహమ్మదీయులూ సగాని సగంగా వున్నారు. ఇంతకు ముందెప్పుడూ ఆ గ్రామంలో మత కలహాలు లేవు. కాని, కొద్దిరోజులనుంచి గ్రామస్థులలో ఆవేశాలు పెరుగుతూ వచ్చినై. "కారణం ఇది" అని ఎవరూ చెప్పలేరు. అసలే ఉద్రేకాలతో ఉండటం వల్ల, ప్రతి చిన్న విషయం భయంకర రూపం దాల్చటం మొదలు పెట్టింది. ఆ రోజు ఒక మహమ్మదీయ బాలుణ్ణి ఒక హిందువు కొట్టటం, దానితో మహమ్మదీయులకి కోపం రగలటం జరిగింది. ద్వేషాలు పెరిగిపోయి విచక్షణా జ్ఞానం నశించింది రెండు పక్షాలకీ.

అటువంటి పరిస్థితుల్లో కమలాకరం తన గ్రామంలో అడుగు పెట్టాడు. సంగతులు తెలుసుకుని హిందువులకూ, మహమ్మదీయులకూ సఖ్యత కుదర్చటానికి ప్రయత్నించాడు. కాని, లాభం లేకపోయింది.

"నువ్వు హిందువువి" అన్నారు మహమ్మదీయులు.

"నీలో హిందూ రక్తం లేదు" అన్నారు హిందువులు.

కాని, కమలాకరం నిరాశ చెందలేదు. నిష్కల్మష హృదయంతో తన ప్రయత్నం తాను చేస్తూనే వున్నాడు.

ఒక రోజు అతను చీకటిపడి యింటికి వస్తూ వుండగా ఎవరో అతన్ని పొడిచి చంపేశారు ఈ వార్త అతని అన్నకి తెలిసింది అంతవరకు కమలాకరాన్ని చూసి నూరుకుంటూ వున్న అతని అన్న, ఆవేశంతో విజృంభించాడు. నిర్దాక్షిణ్యంగా మహమ్మదీయులను హింసించటం మొదలు పెట్టాడు.

"రక్తానికి రక్తం" అన్నాడు.

"నా తమ్ముడి ఆత్మశాంతికోసం" అన్నాడు.

ఆ రోజునుంచీ కమలాకరం అన్న, హిందువులకి నాయకత్వం వహించాడు. తన తమ్ముణ్ణి అకారణంగా చంపారనే కసి అతన్ని అనేక దారుణ కృత్యాలకి పురికొల్పింది.

"రక్తానికి రక్తం!"

"నా తమ్ముడి ఆత్మశాంతికోసం."

ఈ మాటలు అతనికి తారకమంత్రం అయినై.

* * *

గ్రామం అంతా కంపించిపోయింది. ప్రజలు భయంతో గడగడ వొణికిపోయారు. హిందువులుగాని, మహమ్మదీయులుగాని బయటికి అడుగు పెట్టటంలేదు. బయటికి వచ్చిన ప్రాణి మళ్ళీ యింటికివెళ్ళే ఆశ లేదు. మతోద్రేకం వీరవిహారం చేస్తూ వుంది.

కమలాకరం అన్న పూనకం పూనినవాడికి మల్లే ప్రవర్తించాడు. అతని దగ్గరికి వెళ్ళటానికిగాని, మాట్లాడటానికి గాని అందరికీ భయంగా వుంది. ఎప్పుడూ కత్తి విడువకుండా తిరిగేవాడు.

ఇలా వుండగా ఒకరాత్రి ఒక అమ్మాయి అతనిదగ్గరకు ఒక వుత్తరం పట్టుకువచ్చింది. ఆ అమ్మాయిని చూస్తే కమలాకరం అన్నకి ఆశ్చర్యం కలిగింది. పెద్దవాళ్ళే బయటికి రావటానికి భయపడుతున్న రోజులు! ఈ పిల్ల ఎలా ధైర్యం చేసింది?

"ఎవరు నువ్వు?" అడిగాడు.

"జిజియా చెల్లెలిని"

ఆ పేరు వినగానే కమలాకరం అన్న చెయ్యి కత్తి మీదకు వెళ్ళింది. కాని ఆ పిల్ల చలించకుండా అలాగే చూస్తూ నుంచుంది.

అతను ఉత్తరం విప్పి చదివాడు. జిజియా కమలాకరానికి వ్రాసిన ఉత్తరం అది.

"ప్రియ మిత్రమా!

ఏదీ మనం అనుకున్నట్లు జరగకపోవటం చాల విచారకరం. నేను రాగానే మా వూళ్ళో హిందూ మహమ్మదీయ కల్లోలం ప్రారంభమయింది. శాంతింపజెయ్యటానికి నే ననేక విధాల ప్రయత్నించాను.

ఇవాళ హిందువులు ఒక మహమ్మదీయ బాలుణ్ణి అకారణంగా హింసిస్తూవుంటే చూడలేక అడ్డువెళ్ళాను. "ఇది తప్పు" అని చెప్పాను. "మతకలహం అనర్ధదాయకం" అన్నాను. వారు నా మాట వినలేదు.

"నీవు మహమ్మదీయ స్త్రీవి; అందుకని వారి పక్క మాట్లాడుతున్నావ"ని నిందించారు. వారికి కోపం పెరిగిపోయింది.

నన్ను బాకుతో పొడిచారు. పోటు డొక్కలో తగిలింది. నాకెవరి మీదా కోపంలేదు కాని మనం అనుకున్న దేశసేవ చెయ్యటానికి వీలులేక పోయిందే అని విచారం. ఐనా మీరు ఉన్నారుకదా, మనం కోరిన-ద్వేషాలు లేని, వర్గాలులేని-మానవ సంఘంకోసం పాటుపడతారు కదా అనే నమ్మకంతో నిర్విచారంగా ప్రాణం విడుస్తున్నాను.

ఇట్లు,

జిజియా"

ఈ ఉత్తరం చదివేసరికి కమలాకరం అన్న చేతులు వొణికినై. అతని కళ్ళల్లో నీళ్ళు తిరిగినై....

కమలాకరం అన్న జిజియా చెల్లెలిని దగ్గరకు తీసుకున్నాడు"చెల్లీ" అన్నాడు.

)o....o(